Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు :3

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

శనివారం 18/07/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ







# ధరణి లావాదేవీలపై విచారణకు సిట్

### ⏭ సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ భేటీ

### ⏭ పంచాయతీల ఆదాయం సొంత ఖాతాలోనే జమ

**టి మీడియా, జూలై 17 , హైదరాబాద్ బ్యూరో :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మూడు గంటల పాటు సాగిన ఈ భేటీలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. ధరణి లావాదేవీలపై సమగ్రవిచారణ జరపాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. వివిధ శాఖల అధికారులు, నిపుణులతో సిట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పంచాయతీల ఆదాయం సొంత ఖాతాలోనే జమ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. మంత్రివర్గ సమావేశం అనంతరం నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు.

**ధరణి పోర్టల్ అవకతవకలపై సిట్**

భూముల రికార్డులు, భూ క్రయ విక్రయాలకు సంబంధించి ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణకు ప్రత్యేక సిట్? ఏర్పాటుకు కేబినేట్ ఆమోదం తెలిపిందని మంత్రి పొంగులేటి తెలిపారు. 2020 అక్టోబర్ 29 నుంచి ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిందన్నారు. అప్పటి నుంచి రాష్ట్రంలో జరిగిన భూముల రిజిస్ట్రేషన్లు, రికార్డుల మార్పులు, వ్యవసాయ భూములు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల బదలాయింపులు సహా జరిగిన అన్ని అనుమానాస్పద లావాదేవీలను లోతుగా పరిశీలించాలని మంత్రివర్గం నిర్ణయించిందని వివరించారు. ఇప్పటికే చేపట్టిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో దాదాపు 10 వేలకుపైగా అనుమానాస్పద లావాదేవీలున్నట్లు ప్రభుత్వం గుర్తించిందని వివరించారు. అందుకే భూముల లావాదేవీలకు సంబంధించిన డిజిటల్ రికార్డులు, లాగిన్ వివరాలు, రికార్డుల్లో చేసిన మార్పులు, అధికారుల అనుమతులు, భూముల వర్గీకరణ మార్పులు, లబ్ధిదారుల వివరాలను సమగ్రంగా పరిశీలించాలని మంత్రివర్గం నిర్ణయించిందన్నారు. ధరణిలో పోర్టల్ తర్వాత కొన్ని మాడ్యుల్స్ మార్చి రైతులకు ఉపయోగంగా ఉండేలా తమ ప్రభుత్వం భూభారతి అమల్లోకి తెచ్చిందని పొంగులేటి తెలిపారు. ఇప్పటికీ ఆనాడు సాఫ్ట్ వేర్ రూపకల్పన చేసిన పోర్టల్ లో ఉన్న లోపాలతో అవకతవకలు వెలుగులోకి వస్తున్నాయని చెప్పారు. అందుకే ధరణి వ్యవహారంలో బాధ్యులు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. సిట్ వేసి బాధ్యులను గుర్తించాలని నిర్ణయించిందని వివరించారు.

**వర్షాభావ పరిస్థితులపై కేంద్రానికి లేఖ**

రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్?నినో ప్రభావంపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. పంటల సాగు వ్యవసాయ అనుబంధ రంగాలపై ప్రభావం, తాగునీరు సాగునీటి ఇబ్బందులు, ఉపాధి కూలీల పరిస్థితులను సమగ్రంగా వివరిస్తూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అంచనా వేసేందుకు ప్రత్యేక బృందాన్ని రాష్ట్రానికి పంపించాలని, ఎల్‌నినో కంటింజెన్సీ ప్రణాళికల అమలుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసిందని చెప్పారు.

**తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు**

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో దాదాపు 40 శాతం వర్షపాతం లోటు ఉందని మంత్రి పొంగులేటి అన్నారు. తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ సరఫరాపై




వెంటనే ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారన్నారు. రానున్న రోజుల్లో పరిస్థితులు మరింత ఇబ్బందికరంగా మారే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు ఉన్నందున, అన్ని శాఖలు ముందస్తు చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారని చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు చేసే ఫిర్యాదులకు వెంటనే స్పందించాలని మంత్రివర్గం నిర్ణయించిందని తెలిపారు. ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల సాగును రైతులు నివారించి, తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు కేబినేట్ విజ్ఞప్తి చేసింది.

**ఎల్‌నినో ప్రభావంపై అవగాహన సదస్సులు**

ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, అందుబాటులో ఉన్న నీటి వనరులు, రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని సూచించింది. రాష్ట్ర ప్రణాళిక మండలి వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి సారథ్యంలో వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలతో వ్యవసాయ రంగంపై ఎల్నినో ప్రభావంపై ప్రత్యేక నివేదిక రూపొందించాలని మంత్రివర్గం సూచించింది. అన్ని జిల్లాల్లో క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు, వెంటనే చేపట్టాల్సిన చర్యలను తెలుసుకునేందుకు అత్యవసర సమీక్ష సమావేశాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నెల 20వ తేదీ సోమవారం ఉమ్మడి జిల్లాల వారీగా జిల్లా మంత్రుల ఆధ్వర్యంలో అక్కడి ప్రజా ప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతి జిల్లా ఇన్ ఛార్జీ మంత్రితో పాటు ఒక్కో సీనియర్ ఐఏఎస్ అధికారికి ఈ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. ఈ ప్రకృతి గండం నుంచి గట్టెక్కేందుకు అన్ని శాఖలు సన్నద్ధంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ, సమన్వయంతో పనిచేసి వర్షాభావ సంక్షోభాన్ని అధిగమించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది.

**మరిన్ని కీలక నిర్ణయాలు ఇవే**

టెండర్ల ప్రక్రియ కోసం ప్రత్యేక చట్టం చేయాలని కేబినెట్ నిర్ణయం

అన్ని శాఖల్లో టెండర్ల ప్రక్రియ ఒకే తీరుగా ఉండేలా చట్టం తేవాలని నిర్ణయం

పంచాయతీల సొంత ఆదాయాన్ని గ్రామ పంచాయతీ ఖాతాలోనే జమ చేయాలని కేబినెట్ నిర్ణయం

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ట్రాన్స్ జెండర్లను కో–ఆప్షన్ సభ్యులుగా నియమించాలని నిర్ణయం

ఇందుకోసం మున్సిపాలిటీస్ చట్టం--2019ను సవరించే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది

శంషాబాద్ సమీపంలో రైల్ హబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. హైదరాబాద్--పుణె--ముంబైకి ఒక రూట్, హైదరాబాద్--బెంగుళూరు మరో రూట్, హైదరాబాద్--అమరావతి--తిరుపతి--చెన్నై మరో రూట్ బుల్లెట్ రైళ్లకు కేంద్రం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ముక్తేశ్వర్ ఎత్తిపోతల పథకం (చిన్న కాళేశ్వరం) పూర్తి చేసేందుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గోదావరి నదిపై కన్నెపల్లి నుంచి 4.50 టీఎంసీల నీటిని ఎత్తిపోసి మంథని నియోజకవర్గంలో 45 వేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు ఈ పథకం పూర్తి చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇప్పటికే పూర్తయిన పనులను అంచనా వేసుకొని, ప్రాజెక్టు పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన పనులకు ఆమోదం తెలిపింది.

## దేశంలో తొలి హైడ్రోజన్ రైలును ప్రారంభించిన ప్రధాని మోదీ



**టి మీడియా, జూలై 17 , ఢిల్లీ బ్యూరో :** పర్యావరణానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసేందుకు భారతీయ రైల్వే తొలి అడుగు వేసింది. దేశంలోనే తొలిసారి హైడ్రోజన్‌తో నడిచే రైలు పట్టాలపై పరుగులు పెట్టింది. హరియాణాలోని జింద్ నుంచి సోనిపట్ మధ్య నడిచే హైడ్రోజన్ రైలును ప్రధాని నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించారు. 10 కోచ్‌లతో అందుబాటులోకి తెచ్చిన ఈ హైడ్రోజన్ రైలు హరియాణాలోని జింద్–సోనిపత్ స్టేషన్ల మధ్య నడుస్తుంది. ఈ రైలు వారానికి ఆదివారం మినహా ఆరు రోజులు నడవనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రతి ఆదివారం షెడ్యూల్డ్ నిర్వహణ, సాంకేతిక తనిఖీల కోసం దీనిని దిల్లీలోని షకుర్‌బస్తి వర్క్‌షాప్‌నకు పంపుతారని తెలిపారు. జింద్ సిటీ, పాండు పిండారా, లలిత్ ఖేడా, భంబేవా, ఇషాపుర్ ఖేరి, బుటానా, ఖంద్రాయ్, గోహానా, రథ్రా, లాత్, మోహనా, హరియాణా, బర్వాస్ని స్టేషన్లలో స్టాపులు ఉంటాయన్నారు.

**పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారీ**

పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఈ హైడ్రోజన్ రైలు మన ఇంజినీరింగ్ నైపుణ్యానికి మచ్చుతునకగా నిలిచింది. జింద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న ప్రధాని మోదీ తొలుత హైడ్రోజన్ రైలు నమూనాను ప్రదర్శించారు. అనంతరం జింద్ నుంచి సోనిపట్‌కు బయలుదేరిన తొలి హైడ్రోజన్ రైలును పచ్చజెండా ఊపి ప్రారంభించారు. జింద్ నుంచి సోనిపట్‌కు 89 కిలోమీటర్ల దూరం ఉండగా, ఈ రైలు కేవలం రెండు గంటల్లోనే చేరుకుంటుంది. మధ్యలో 12 స్టేషన్లలో ఆగుతుంది. రైలును ప్రారంభించిన ప్రధాని అందులో ఉన్న సిబ్బందికి, తొలిసారిగా అందులో ప్రయాణించిన విద్యార్థులకు చేయి ఊపి పంపించారు. జింద్ రైల్వే స్టేషన్‌కు వచ్చిన ప్రజలు, విద్యార్థులను పలకరిస్తూ మోదీ అభివాదం చేశారు.

**పర్యావరణహితం**

ప్రస్తుతం దేశంలో విస్తృతంగా నడుస్తున్న విద్యుత్ రైళ్లు పైన ఉండే కరెంటు తీగల నుంచి విద్యుత్‌ను తీసుకుంటాయి. దీనికి భిన్నంగా హైడ్రోజన్ రైలు సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుంటుంది. హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ ఈ రైలు నడుస్తుంది. అంటే హైడ్రోజన్‌ను విద్యుత్‌గా మార్చుకుని ఇంజిన్‌ను నడిపిస్తుంది. ఈ ప్రక్రియలో నీటిఆవిరిని ఉద్గారంగా వెలువరిస్తుంది. నీటిఆవిరి బయటకు వెలువడడం వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని జరగదు. డీజిల్ ఇంజిన్ల వల్ల కార్బన్ ఉద్గారాలు వెలువడతాయి. శిలాజ ఇంధనాలపై ఆధారపడాల్సి ఉంటుంది. అంతేకాకుండా శిలాజ ఇంధనాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడానికి భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని వినియోగించాల్సి ఉంటుంది. హైడ్రోజన్ రైలు వల్ల చమురుపై ఆధారపడే పరిస్థితి క్రమంగా తగ్గుతుంది. డీజిల్ ఇంజన్లతో పోలిస్తే హైడ్రోజన్ రైలు ఇంజిన్ తక్కువ శబ్దం చేస్తుంది.

3,200 హెచ్‌పీ సామర్థ్యంగల ప్రొపల్షన్ వ్యవస్థతో నడిచే ఈ రైలు నిర్వహణలో ఉన్న శక్తివంతమైన హైడ్రోజన్ పవర్ ట్రైన్‌గా రికార్డు సృష్టించింది. ఈ రైలుకు పది బోగీలు ఉండగా ప్రపంచంలోనే అతి పొడవైన ప్యాసింజర్ హైడ్రోజన్ రైలుగాను రికార్డులకు ఎక్కింది. దీనిలో 2,600 మంది ప్రయాణించొచ్చు. ఈ రైల్లో వివిధ అంచెల్లో భద్రతా వ్యవస్థలు ఉన్నాయి. అవి హైడ్రోజన్ లీకేజీ, వేడి, మంటలు, పొగ వంటి ముప్పు తలెత్తే పరిస్థితులపై ఎప్పటికప్పుడు కన్నేసి ఉంచుతాయి. ఏదైనా సమస్య ఉత్పన్నమైతే సెకన్లలోనే అప్రమత్తం చేస్తాయి. రైల్లో వెంటిలేషన్ వ్యవస్థ గాలి ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా చూస్తుంది. అందువల్ల ఏదైనా లీకేజీ తలెత్తినా అది గాల్లోకి వెళ్లి పలుచబడుతుంది. ప్రమాదాన్ని గుర్తిస్తే ఆటోమేటిక్ షట్‌ఆఫ్ వ్యవస్థ తనంతట తాను హైడ్రోజన్ సరఫరాను నిలిపివేస్తుంది. భద్రతకు ప్రాధాన్యమిస్తూ లోకో పైలట్ క్యాబిన్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. లోకో పైలట్ ఎదుట ఉండే స్క్రీన్ రైలు పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేస్తుంది.


## భారీ ఉగ్రకుట్ర భగ్నం

### ఐదుగురు టెర్రరిస్టులు అరెస్టు

**టి మీడియా, జూలై 17 , ఢిల్లీ బ్యూరో :** పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రసంస్థ జైషే మహ్మద్‌కు చెందిన ఐదుగురు ముష్కరులను గుజరాత్ ఏటీఎస్ అధికారులు అరెస్టు చేశారు. పటన్ జిల్లా సిద్ధ్‌పూర్ తాలూకా ఖడియాల్ గ్రామంలో వీరందరినీ అదుపులోకి తీసుకున్నారు. వారిని బిలాల్ అబిద్‌భాయ్ షేరా, మహ్మద్ అయూబ్ కడివాలా, మహ్మద్ పాలన్‌పురి, షఫియా రాయిస్ ముక్తి, మహ్మద్ హసన్ కర్దియాగా గుర్తించారు. నిందితులను మెహసానా జిల్లాలోని జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆర్.ఎం భాటియా ముందు గుజరాత్ ఏటీఎస్ అధికారులు హాజరుపర్చారు. ఈ ఐదుగురిని జులై 24 వరకు గుజరాత్ ఏటీఎస్ కస్టడీకి ఆర్.ఎం భాటియా అప్పగించారు.

**నిందితులపై ఉపా చట్టం కింద కేసు నమోదు**

గుజరాత్‌లో ఉగ్ర నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు యత్నిస్తూ జులై 3న ఏటీఎస్ చేతికి 8 మంది ఉగ్రవాదులు చిక్కారు. ఆ ఎనిమిది మంది ముష్కరులను విచారించగా ఈ ఐదుగురి పేర్లు బయటకొచ్చాయి. నిందితుల్లో ఒకరు క్రూడ్ టైమ్ బాంబును తయారు చేసి, దాన్ని పరీక్షించేందుకు విఫలయత్నం చేసినట్లు గుజరాత్ ఏటీఎస్ అధికారులు తెలిపారు. ముందుగా అరెస్టైన ఎనిమిది మందిలోని ఒకరు ముష్కరుడు ఈ ముఠాకు బాంబు తయారీ సామగ్రిని అందించినట్లు గుర్తించామని వెల్లడించారు. జైషే మహ్మద్ తన ఉగ్ర కార్యకలాపాలను మరింతగా వ్యాప్తి చేయడానికి గుజరాత్‌లో ఒక క్రియాశీల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసేందుకు నిందితులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. నిందితులపై చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం



(ఉపా)లోని సెక్షన్లు 13, 17, 18, 38, 39, భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు 148, 61 కింద కేసు నమోదు చేశామని స్పష్టం చేశారు. అరెస్టైన ఐదుగురిలో ఒకరు టైమ్ బాంబును తయారు చేయడానికి ప్రయత్నించారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీఆర్ దంతానీ కోర్టుకు తెలిపారు. అందుకే నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారించాలని ఏటీఎస్ కోరుతోందని చెప్పారు. బాంబు తయారీ సామగ్రి, ఉర్దూ భాషలో ఉన్న జైషే మహ్మద్ ప్రచార సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలను ఇంకా స్వాధీనం చేసుకోవాల్సి ఉందని అన్నారు.

నిందితులు ఒక సాధారణ టైమ్ బాంబును పరీక్షించడానికి ప్రయత్నించారని, అయితే ఆ ప్రయత్నం విఫలమైందని వెల్లడించారు. వారు బాంబు తయారీ సామగ్రిని ఎక్కడ సేకరించారు? దానిని ఎక్కడ దాచిపెట్టారు జైషే మహ్మద్ ప్రచార సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలను నిందితులు ఎలా పొందారు అనే అంశాలపై ఏటీఎస్ దర్యాప్తు చేస్తోందన్నారు. గుజరాత్ ఏటీఎస్ దర్యాప్తులో ఐదుగురి పేర్లు బయటకొచ్చాయి.


## సర్వే ప్రామాణికం 'ఓటరు జాబితా' గల్లంతు

### ⏭ హైదరాబాద్‌లో గందరగోళ పరిస్థితులు

**టి మీడియా, జూలై 17 , హైదరాబాద్ బ్యూరో :** సర్వేకు ప్రామాణికమైన ఓటరు జాబితాను అధికారులు గల్లంతు చేశారు. ఈ పరిస్థితి హైదరాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో చోటుచేసుకుంది. న్యూ బోయిన్?పల్లి, తిరుమలగిరి, ఇతర ప్రాంతాలతో కలిపి నాలుగు పోలింగ్ కేంద్రాల్లో 2002 నాటి ఓటర్ల వివరాలు మాయమయ్యాయి. ఆ జాబితాలోని 4 వేల మంది ఓటర్ల పరిస్థితి ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇలాంటి గందరగోళ పరిస్థితులు హైదరాబాద్ నగరమంతటా ఉన్నాయి.

**మీ వివరాలు రాసి ఎన్యుమరేషన్ తిరిగివ్వాలి**

ఎన్యూమరేషన్ ఫారంలో మూడు గడులుంటాయి. మొదటి గడిలో 2002లో తనకున్న ఓటు వివరాలు రాయాలి. ఒకవేళ అప్పుడు ఓటరు కాకపోతే రెండో గడిలో తల్లిదండ్రులకు చెందిన నాటి ఓటరు వివరాలు అందులో రాయాలి. అదీ కుదరకపోతే మూడో గడిలో ఓటరు ప్రస్తుత వివరాలను నమోదు చేయాలి. మొదటి, రెండో భాగాల్లో వివరాలను నమోదు చేయడం 70 శాతం మందికి ఇబ్బందిగా ఉంటోంది. దీంతో బీఎల్?వోలు మూడో భాగంలో మీ పేరు, మీ తల్లిదండ్రుల పేరు, ఇతర వివరాలను నింపాలి. ఆ



తర్వాత ఎన్యూమరేషన్? పత్రాన్ని తిరిగివ్వాలని సూచిస్తున్నారు.

**80 శాతం మందికి నోటీసులు**

మూడో గడిని మాత్రమే నింపిన వారు, ఓటరు జాబితా గల్లంతు, పేర్లు సరిపోలకపోవడం వంటి మొదలైన కారణాలున్న వ్యక్తులు, నోటీసులు అందుకుంటారని అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు డిజిటైజేషన్? చేస్తున్న ఎన్యుమరేషన్ పత్రాల్లోని వివరాల్లో 80 శాతం మందికి నోటీసులందే సూచనలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

జిల్లాల వారీగా డిజిటైజేషన పూర్తయిన ఎన్యూమరేషన్ పత్రాలు

| జిల్లా | ఓటర్లు | డిజిటైజేషన్ పూర్తయినవి |
|---|---|---|
| రంగారెడ్డి | 36,99,743 | 41.46% |
| మేడ్చల్ మల్కాజిగిరి | 29,79,130 | 28.41% |
| హైదరాబాద్ | 47,36,669 | 31.54% |

రాష్ట్రంలో ఎస్ఐఆర్ గడువు పెంపు

తెలంగాణలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ గడువు పది రోజులు పొడిగించారు.

# మహిళల రక్షణ కోసం షీ టీమ్



## ⏭ పాల్గొన్న స్నేహలత

**టీ మీడియా, జులై 17, పెద్దపల్లి ప్రతినిధి:** రామగుండం సి. పి ఆదేశాల మేరకు, పెద్దపెల్లి షీ టీమ్ వారు, జెడ్ పి హెచ్ ఎస్ గర్ల్స్ హై స్కూల్, పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో జరిగే ఉపాధ్యాయుల ట్రైనింగ్ లొ షి టీమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. అందులో భాగంగా షీ టీమ్ మెంబర్ స్నేహలత మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ఎలా ఉండాలి, పి ఓ సి ఎస్ ఓ యాక్ట్ గురించి, సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై ఎలా ఉంది, అని తెలిపారు. మహిళల భద్రతమరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్,మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు ,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100/112 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లొ ఇంచార్జ్ జగదీశ్వర్ , ఉపాధ్యాయులు మరియు షీ టీమ్ సభ్యులు, సురేష్, పాల్గొన్నారు.

# మినీ ట్యాంక్ బండి గా బంధంపల్లి చెరువు



## ⏭ ప్రభుత్వ విప్ విజయరామరావు

**టీ మీడియా, జులై 17, పెద్దపల్లి జిల్లా ప్రతినిధి**
పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బందంపల్లి వద్ద ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ. 3 కోట్లతో నిర్మించబోయే మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు విజయరామరావు. .ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెద్దపల్లి ప్రజలు ఆహ్లాదకరంగా గడిపేందుకు రూ. 3 కోట్ల నిధులతో బంధంపల్లి చెరువు కట్టను మినీ ట్యాంక్ బండ్ గా నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. మినీ ట్యాంక్ బండ్ పనులు పరిశీలించిన సమయంలో చెరువు కట్ట వద్ద మరింత సుందరంగా ఉండేందుకు తీగల వంతెన కూడా నిర్మాణం చేపడతామని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు చేశారు. మినీ ట్యాంక్ బండ్ పనులను నాణ్యతగా చేపట్టాలని నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా పని చేయాలని గుత్తేదారునికి సూచించడం జరిగిందని పెద్దపల్లి ప్రజలకు రానున్న రోజుల్లోనే మినీ ట్యాంక్ బండ్అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పెద్దపల్లి పట్టణాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, నూగిళ్ళ మల్లయ్య,మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ మరియు స్థానిక కౌన్సిలర్,పురేళ్ళ శైలజా సుధాకర్,సంబంధిత ఇరిగేషన్ అధికారులు, పట్టణ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్రైడే డ్రైడే కార్యక్రమం




## పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్

**టీ మీడియా, జులై 17 పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని నాలుగవ వార్డులో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి కౌన్సిలర్ జమ్ములమ్మ తో కలిసి వార్డులో పర్యటించారు ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ డెంగ్యూ మలేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇళ్లలోని కూలర్లు పాత టైర్లు కొబ్బరి చిప్పలు పూలకుండీలలో నిల్వ ఉన్న నీటిని ఎక్కువకాలం ఉంచకుండా ఏప్పటికప్పుడు పారబోయాలని ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గణేష్ సానిటరీ ఇన్స్పెక్టర్ యోగేష్ కుమార్ మున్సిపల్ సిబ్బంది ఆరోగ్య కార్యకర్తలు ఆర్పీయం లు ఆశా కార్యకర్తలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలకు బెంచీలు అందజేసిన జిల్లెల చిన్నా రెడ్డి

**టీ మీడియా, జులై 17, పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల కోరిక మేరకు పేదల డాక్టర్ జిల్లెల మాధవ రెడ్డి జ్ఞాపకార్థం వారి ట్రస్ట్ నుండి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు విద్యార్థులకు బెంచీలు ఏర్పాటు చేయడం జరిగింది పట్టణ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బెంచీలను కళాశాల యజమాన్యానికి అందజేయాలని పిలుపుమేరకు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి అయ్యవారిపల్లి సర్పంచ్ కురుమయ్య రాంపురం సహదేవుడు సత్యనారాయణ రెడ్డి తోమలపల్లి కృపాకర్ రెడ్డి గుమ్మడం హరికుమార్ రెడ్డి రాంపురం ఈశ్వర్ రెడ్డి సునీల్ రెడ్డి ఆనంద్ సాగర్ పాతపల్లి చంద్రశేఖర్ గుమ్మడం తాండ రాజు నాయక్ తిప్పాయిపల్లి నవీన్ గౌడ్ బోయ బాలరాజు నరేష్ తదితరులు పాల్గొన్నారు




# జర్నలిస్టుల పాత్ర కీలకం

## ⏭ అఖిలపక్ష నాయకులు

**టీ మీడియా, జులై 17, పెద్దపల్లి జిల్లా ప్రతినిధి:**
అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు లొంగకుండా జర్నలిస్టుపై దాడికి పాల్పడిన నిందితులపై కఠిన కేసులు నమోదు చేసి, వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా అఖిలపక్ష పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సుమన్ టీవీ ప్రతినిధి శ్రీకాంత్‌పై ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే ఔట్సోర్సింగ్ పేషెంట్ కేర్ సిబ్బంది దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ విధులు నిర్వహించే హక్కు కలిగి ఉన్నారని, వార్తా సేకరణలో ఉన్న మీడియా ప్రతినిధులపై దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి వారిపై దాడులు జరగడం




ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని నాయకులు అన్నారు. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, వారిని వెంటనే అరెస్ట్ చేసి బాధితుడికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జర్నలిస్టుల భద్రతను ప్రభుత్వం పూర్తి స్థాయిలో హామీ ఇవ్వాలని, ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మీడియాపై దాడులను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని, జర్నలిస్టుల స్వేచ్ఛను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, తెలంగాణ రక్షణ సేన నాయకులు సుభాష్, ప్రేమ్, మిట్టపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రిటన్ కొత్త ప్రధానిగా ఆండీ బర్న్‌హామ్

## ⏭ వచ్చే వారమే బాధ్యతలు స్వీకరణ

**టి మీడియా, జూలై 17 , ఢిల్లీ బ్యూరో :**
బ్రిటన్ రాజకీయాల్లో కీలక పరిణామం జరిగింది. అధికార లేబర్ పార్టీ కొత్త నాయకుడిగా ఆండీ బర్న్‌హామ్ శుక్రవారం రోజు అధికారికంగా ఎన్నికయ్యారు. దీంతో ఆయన వచ్చే సోమవారం రోజు యునైటెడ్ కింగ్‌డమ్ కొత్త ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా సమర్పించిన వెంటనే కింగ్ ఛార్లెస్– ××× ఆయనను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఆహ్వానించనున్నారు. దీంతో 10 డౌనింగ్ స్ట్రీట్‌లో బర్న్‌హామ్ ప్రధాన మంత్రి పదవిని చేపట్టనున్నారు.

**నామినేషన్‌లో ఒక్కరే అఖండ మద్దతు**

లండన్‌లో జరిగిన లేబర్ పార్టీ ప్రత్యేక సమావేశంలో పార్టీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఎన్?ఈసీ) ఛైర్ షబానా మహ్మూద్ బర్న్‌హామ్ ఎన్నికను అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె 'ఈ ఎన్నికలో నామినేషన్ దాఖలు చేసిన ఎంపీ ఒక్కరే. అందుకే ఫలితం ముందుగానే ఖరారైంది' అని వ్యాఖ్యానించారు. ఆండీ బర్న్‌హామ్ ఒక్కరే అభ్యర్థిగా నిలిచారు. ఎలాంటి ఉత్కంఠకు తావులేదు, బరిలో నిలిచింది ఒక్కరేనని సరదాగా వ్యాఖ్యానించారు షబానా. దీంతో ఎన్నిక లాంఛనప్రాయంగానే జరిగింది. గురువారం రాత్రి



నాటికి బ్రిటన్ పార్లమెంట్ దిగువ సభ 'హౌస్ ఆఫ్ కామన్స్'లోని లేబర్ పార్టీకి చెందిన 403 మంది ఎంపీల్లో 379 మంది ఆయన అభ్యర్థిత్వానికి మద్దతు ప్రకటించారు. భారీ మెజార్టీ మద్దతు సాధించడంతో ఆయన విజయం ముందుగానే ఖరారైపోయింది.ఆండీ బర్న్‌హామ్ గతంలో గ్రేటర్ మాంచెస్టర్ మేయర్‌గా పనిచేశారు. అంతకుముందు ఆయన బ్రిటన్ ప్రభుత్వంలో పలు కీలక మంత్రిత్వ శాఖల్లోనూ బాధ్యతలు నిర్వర్తించారు. స్థానిక పాలనలో మంచి గుర్తింపు సంపాదించినప్పటికీ, మాంచెస్టర్ వెలుపల దేశవ్యాప్తంగా ఉన్న ఓటర్లలో ఆయనకు ఇప్పటికీ పెద్దగా గుర్తింపు లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే లేబర్ పార్టీలో ఆయనకు లభించిన విశేష మద్దతు కారణంగా ప్రధాని పదవికి ఆయన ఎంపికయ్యారు. ప్రధాన మంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత పలు కీలక అంశాలపై ఆయన ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందోననే దానిపై బ్రిటన్‌లో ఆసక్తి నెలకొంది. ఇప్పటివరకు తన ప్రాధాన్యతలపై బర్న్‌హామ్ పూర్తి స్థాయిలో వివరాల్ని వెల్లడించలేదు.

**సోమవారమే స్టార్మర్ రాజీనామా– బర్న్‌హామ్ బాధ్యతలు**

వచ్చే సోమవారం రోజు ప్రధాని కీర్ స్టార్మర్ బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో కింగ్ ఛార్లెస్– ××× ని కలిసి అధికారికంగా రాజీనామాను సమర్పిస్తారు. అనంతరం ఆండీ బర్న్‌హామ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు రాజు ఆహ్వానిస్తారు. తర్వాత అధికారికంగా 10 డౌనింగ్ స్ట్రీట్‌లో ప్రధానిగా బాధ్యతలు స్వీకరిస్తారు. లేబర్ పార్టీలో ఈ నాయకత్వ మార్పుతో బ్రిటన్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది. దేశీయ, అంతర్జాతీయ సవాళ్ల నడుమ ఆండీ బర్న్‌హామ్ నాయకత్వంలో కొత్త ప్రభుత్వం ఎలా పనిచేస్తుందన్న దానిపై రాజకీయ వర్గాలు, అంతర్జాతీయ విశ్లేషకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# రాష్ట్రంలో భారీగా పెరిగిన ఇంజనీరింగ్ సీట్లు



## ⏭ అదనంగా 15 వేల మంది విద్యార్థులకు ఉపయోగం

**టి మీడియా, జూలై 17 , హైదరాబాద్ బ్యూరో :**
రాష్ట్రంలో ఇంజినీరింగ్ సీట్లు భారీగా పెరగనున్నాయి. శుక్రవారం నుంచి మొదలుకానున్న ఇంజినీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్‌లో అదనపు సీట్లు కలవనున్నాయి. ఈ విద్యా సంవత్సరం (2026–27)లో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) సుమారు 15 వేల అదనపు బీటెక్ సీట్లను కళాశాలలకు మంజూరు చేసింది. వాటిని అనుమతించాలా? లేదా అన్నది రాష్ట్ర సర్కారు నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. ఈ మేరకు సీఎం కార్యాలయ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, విద్యాశాఖ అధికారులు గురువారం సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమై చర్చించారు. అదనపు సీట్లకు ఆయన అంగీకారం తెలపడంతో ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ అయిన రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఆధ్వర్యంలో అధికారులు కళాశాలలు, సీట్ల వారీగా కసరత్తు మొదలు పెట్టారు.

**రేపటి నుంతి వెబ్ ఆప్షన్లు**

దాదాపు నాలుగు వేల సీట్లు పెరగవచ్చని తెలుస్తోంది. అందులో 70 శాతం కన్వీనర్ కోటా కింద కౌన్సెలింగ్‌లో చేరనున్నాయి. ఈ నెల 18 నుంచి వెబ్ ఆప్షన్లు ప్రారంభం కానుండటంతో శుక్రవారం అర్ధరాత్రికి లేదా శనివారం ఉదయానికి స్పష్టత రావొచ్చని భావిస్తున్నారు. కొన్ని కళాశాలలకు అదనపు సీట్లు ఇవ్వకుంటే న్యాయస్థానాలను ఆశ్రయిస్తారేమోనన్న సందేహంతో అధికారులు ఎన్ని కళాశాలల్లో ఎన్ని అదనపు సీట్లు రావొచ్చనే విషయాన్ని వెల్లడించడం లేదని తెలుస్తోంది. మరోవైపు అదనపు సీట్లు మంజూరు చేయాలంటే ఆయా వర్సిటీలు, తనిఖీలు నిర్వహించి తగిన సౌకర్యాలు ఉన్నాయని నివేదిక ఇవ్వాలి. ఇంతవరకు జేఎన్‌టీయూహెచ్, ఓయూ అలాంటి తనిఖీలు చేయలేదు. విద్యాశాఖ వర్గాలు మాత్రం అన్నివిధాలా ఏర్పాట్లు చేసుకున్నట్లు చెబుతుండటం గమనార్హం.

**మిగిలిపోయిన సీట్లు 27,487**

తొలి విడతలో 79 వేల మందికిపైగా సీట్లు కేటాయించగా ఇంకా 8,162 మిగిలాయి. సీట్లు పొందిన వారిలో 19,325 మంది ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయలేదు. అందువల్ల ఆ సీట్లు కూడా ఖాళీగా ఉన్నట్లే లెక్క. అంటే మొత్తం 27,487 సీట్లు రెండో విడతలో అందుబాటులో ఉన్నాయి. ప్రముఖ కళాశాలల్లోనూ సీట్లు పెరగనున్నందున అధిక సంఖ్యలో విద్యార్థులు వెబ్ ఆప్షన్లు మార్చుకునే అవకాశం ఉంది.

**తొలి విడతలో 90 శాతం సీట్లు భర్తీ**

బీటెక్ సీట్లు తొలి విడత కౌన్సెలింగ్‌లో 90.70 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. కన్వీనర్ కోటా కింద ఈడబ్ల్యూఎస్ సీట్లతో కలిపి 88,053 సీట్లు అందుబాటులో ఉండగా, 88,510 మంది వెబ్? ఆప్షన్లు ఇచ్చి సీట్లకు పోటీపడ్డారు. వారిలో 79,891 మంది అభ్యర్థులు బీటెక్ సీట్లు సాధించారు. తొలి విడత సీట్లను శుక్రవారం రాత్రి కేటాయించారు. సీఎస్ఈ, సంబంధిత 17 బ్రాంచీల్లో 62,509 సీట్లుండగా వాటిల్లో 58,376 సీట్లు నిండాయి. అందులో 4133 సీట్లు మిగిలాయి. గత ఏడాదిలో పోల్చుకుంటే కంప్యూటర్ సైన్స్ బ్రాంచీల్లో సీట్లు అధికంగా మిగిలిపోవడం గమనార్హం. అదే సమయంలో ఈసారి మెకానికల్, సివిల్, ఈసీఈ విభాగాల్లో సీట్ల భర్తీ స్వల్పంగా పెరిగినట్లు తెలుస్తోంది. ఈ సీట్లన్నీ చివరి విడత నాటికి పూర్తి స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు.


**తొలి విడతలో చివరకు ఇలా**

ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన వారు : 89,450,వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారి సంఖ్య : 88,510,సీట్లు పొందిన వారు : 79,891, మిగిలిపోయిన సీట్లు : 8162,87 విద్యాసంస్థల్లో 100 శాతం సీట్లు భర్తీ : తగినన్ని ఐచ్ఛికాలు ఇచ్చుకోకపోవడం, తక్కువ సీట్లు ఉండటంతో 8919 మందికి సీట్లు దక్కలేదు. 8 వర్సిటీలు, 79 కళాశాలలు మొత్తం 87 విద్యాసంస్థల్లో 100 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఈడబ్ల్యూఎస్ కోటా కింద 6335 మందికి సీట్లు దక్కాయి.

# పెట్టింది తినండి, లేకుంటే గొడవే

### ⏭ సర్కార్ ఆసుపత్రుల్లో రోగుల కష్టాలు ఎప్పటికి తీరేనో!

**టి మీడియా, జూలై 17 , హైదరాబాద్ బ్యూరో :**
ఆసుపత్రుల్లో చేరిన రోగులకు నాణ్యమైన ఆహారం అందించటం యాజమాన్యం బాధ్యత. కానీ ఇటీవల పలు సర్కారు ఆసుపత్రుల్లో ఆహార నాణ్యత లోపిస్తుంది. వంట చేసే వారి కాంట్రాక్టు గడువు ముగిసినా వారినే కొనసాగిస్తుండటం అలాగే వారి బకాయిలు సకాలంలో చెల్లించక పోవటంతో ఆ ప్రభావం ఆహారంపై పడుతోంది. దీంతో ఆసుపత్రిలో అందించే ఆహారం నాణ్యంగా లేదని రోగులు వాపోతున్నారు.



**చీఫ్ డైటీషియన్ల కరవు**
ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో చీఫ్? డైటీషియన్లు కరవయ్యారు. దీంతో ఆహార పరిశీలన అరకొరగా సాగుతోంది. ఫలితంగా పోషకాలు లేని ఆహారం రోగులకు అందుతుంది. గాంధీ ఆసుపత్రిలో వంట చేసేవారి గడువు ముగిసి ఏడాది అవుతుంది. అయినా కొత్తగా టెండర్లు వేయటం లేదు. రోగులకు అందించే భోజనం కింద ఒక్కో రోగికి రూ. 80 అలాగే వైద్యునికైతే రూ. 160 ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది.

**నిబంధనలకు విరుద్ధంగా భోజన లెక్కలు**
ఉస్మానియా, గాంధీ ఆసుపత్రుల్లో ఒక్కోసారి 500-600 మందికి ఆహారం పంపిణీ చేస్తుంటారు. అయితే చాలామంది మధ్యాహ్న సమయంలో డిశ్చార్జి అవుతుంటారు. అయినా కూడా వారి పేరును రాత్రి అందించే భోజనం లెక్కలో చూపిస్తుంటారు. దీంతో నిబంధనల మేరకు రోగులకు ఆహార పంపిణీ జరగటం లేదు. తక్కువ మందికి వండి ఎక్కువమంది ఉన్నట్లు లెక్కలు రాయటం అదేపనిగా జరుగుతోంది.

**గతంలో ఎర్రగడ్డలో అక్రమాలు**
ఇలాంటి అక్రమాలు గతంలో ఎర్రగడ్డలోని ఆయుర్వేద ఆసుపత్రిలోనూ చోటు చేసుకున్నాయి. అనుమానం వచ్చి వైద్య ఆరోగ్యశాఖ విచారణకు ఆదేశించడంతో ఆ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. నిజానికి కిడ్నీ, క్యాన్సర్?, గర్భిణులు, కాలేయ బాధితులు, బాలింతలకు ప్రత్యేక డైట్? అందించాలి. కానీ అది కూడా సరిగా అందించట్లేదు. నీళ్లలా సాంబారు, మజ్జిగ పోస్తున్నారని, అధికారులు దృష్టిపెట్టాలని కోరుతున్నారు.

**రోగులకు అందించే మెనూ ఇలా**
ఉదయం టిఫిన్?ను 7.30 నుంచి 8.30 గంటల మధ్య పెట్టాలి. అందులో పొంగల్?, ఉప్మా, కిచిడి, ఇడ్లీ, సాంబారు వంటి అల్పహారం అందివ్వాలి. అలాగే కప్పు టీ లేదా 100 ఎంఎల్? పాలు ఇస్తారు. ఉడికించిన గుడ్డును ఒకటి ప్రతిరోజూ తప్పనిసరిగా ఇవ్వాలి.
మధ్యాహ్న భోజనం 12 నుంచి 1 వరకు అందించాలి. అందులో అన్నం లేదా 8 పుల్కాలు వాటితో పాటు వెజ్? కర్రీ ఒకటి అలాగే ఆకుకూర పప్పు, సాంబారు ఉంటుంది. వీటితోపాటు ఉడికించిన గుడ్డు ఒకటి. అరటిపండు, పెరుగు ఇవ్వాలి.రాత్రి 7 నుంచి 8 గంటలలోపు అన్నం/6 పుల్కాలు, కర్రీ, పప్పు, సాంబారు ఉడికించిన గుడ్డు, పెరుగు, అరటిపండు అందిస్తారు.
రుచిలేని వంటకాలు, ముద్దలుగా అన్నం ఇటీవల దేవరకొండలోని ఏరియా ఆసుపత్రిలోనూ ఇదే తరహాలో జరిగింది. ఆ ఆసుపత్రిలో ఏ అధికారి పర్యవేక్షణ లేకపోవటంతో అక్కడి గుత్తేదారులు ఆడిందే ఆట అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రతిరోజు రోగులకు, బాలింతలకు అందించే ఆహారం ముద్దలుగా అన్నం, రుచిలేని కూరలు, నీళ్ల సాంబారు, పల్చని పాలు, కరవైన గుడ్లు. ఇది అక్కడి మెనూ తీరు. నిజానికి ఏ ఆసుపత్రిలోనైనా ముందుగా సంబంధిత వైద్యుడు రుచి చూశాకే ఆ భోజనాన్ని రోగులకు అందిస్తారు. కానీ దీంట్లో అందుకు భిన్నంగా జరుగుతుంది. దీనివల్ల ఎప్పుడు ఏం అవుతుందోనని రోగులు కంగారు పడిపోతున్నారు.

# పక్కగా భూముల రీసర్వే



### ⏭ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**టీ మీడియా జులై 17 ,టేక్మాల్:**
పక్కగా భూముల రీసర్వే చేయాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అల్లదుర్ మండలకేంద్రం లోనీ నిర్వహించిన భూముల రీసర్వే గ్రామ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. భూ సమస్యలు తలెత్తకుండా ,ప్రతి రైతుకు భూ హక్కులు కల్పించేలా భూమి రీ సర్వే చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అన్నారు. రైతులకు భూ వివాదాలు లేకుండా చేసి , ప్రతి భూ కమతానికి భూధార్ అందిస్తామన్నారు.
భూ పటాలను ప్రక్షాళన చేయాలన్నారు. పక్కగా భూ రీసర్వే చేసి హద్దులను నిర్ణయించేందు కే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం టేక్మాల్ మండలంలో విలేజ్ బౌండరీ సంబంధిత తాసిల్దార్ తో కలిసి అదనపు కలెక్టర్ నగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు వివాదాలకు తావు లేకుండా రైతులకు మేలు చేకూరే విధంగా పటిష్ట ప్రణాళిక ద్వారా ఈ కార్యక్రమం ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడి ల్యాండ్ సర్వే కిషన్ ,స్థానిక తహసిల్దార్, రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్‌కు వెళ్తుండగా వెంటాడిని మృత్యువు




### ⏭ ఇద్దరు విద్యార్థులు మృతి!

**టీమీడియా, జూలై 17 , ముర్షిదాబాద్ :**
పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాలో శుక్రవారం ఉదయం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. విద్యార్థులతో వెళ్తున్న పాఠశాల బస్సును రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందిగా పలువురు విద్యార్థులు తీవ్రంగా గాయపడినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు, రైల్వే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన విద్యార్థులను సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై రైల్వే అధికారులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు ప్రారంభించారు. లెవెల్ క్రాసింగ్ వద్ద భద్రతా నిబంధనలు పాటించాయా? సిగ్నలింగ్‌లో ఏమైనా లోపం జరిగిందా? లేదా బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమా? అనే అంశాలపై విచారణ కొనసాగుతోంది. ఈ ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, గాయపడిన విద్యార్థుల ఖచ్చిత సంఖ్య, అధికారిక సమాచారం కోసం అధికారులు మరింత సమాచారం విడుదల చేయాల్సి ఉంది.

# బాల సాహిత్యానికి అరుదైన గౌరవం






### ⏭ మహారాష్ట్ర పాఠ్యపుస్తకంలో నల్లగొండ ఉపాధ్యాయుడి బాలగేయం

**టి మీడియా, జూలై 17 ,నల్లగొండ :**
నల్లగొండ జిల్లా కనగల్ మండలానికి చెందిన బాల సాహితీవేత్త, ఉపాధ్యాయుడు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి రచించిన "కంప్యూటర్ పిల్లలం" బాలగేయానికి అరుదైన గౌరవం లభించింది. మహారాష్ట్ర ప్రభుత్వం నాలుగో తరగతి తెలుగు "బాలభారతి" పాఠ్యపుస్తకంలో ఈ గేయాన్ని పాఠ్యాంశంగా చేర్చింది. పిల్లలకు సులభంగా అర్థమయ్యే పదాలు, లయబద్ధమైన శైలి, ఆధునిక సాంకేతికతపై అవగాహన కల్పించే అంశాలతో రూపొందిన ఈ గేయం వేలాది మంది విద్యార్థులకు చేరనుంది.బాల సాహిత్యానికి అరుదైన గౌరవం.. మహారాష్ట్ర పాఠ్యపుస్తకంలో నల్లగొండ ఉపాధ్యాయుడి బాలగేయం..తెలుగు నేల మీద పుట్టిన అక్షరం.. తెలుగు రాష్ట్రాల సరిహద్దులు దాటుతున్న తెలుగు బాల సాహిత్యానికి చక్కటి ఆదరణ లభిస్తోంది. బాల సాహితీ వేత్త.. కలం నుంచి జాలువారిన గేయానికి పొరుగు రాష్ట్ర పాఠ్య పుస్తకంలో చోటు దక్కింది. ఇప్పుడు ఆ రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులు పాఠ్యాంశంగా చదవబోతున్నారు. దీంతో తెలంగాణ ఉపాధ్యాయుడి సృజనాత్మకతకు అరుదైన గుర్తింపు లభించడం పట్ల పలువురు విద్యావేత్తలు, సాహితీవేత్తలు ఆయన్ను అభినందిస్తున్నారు.

**బాల సాహితీవేత్త కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి..**
నల్లగొండ జిల్లా కనగల్ మండలం చిన్నమాదారం ఉన్నత పాఠశాలలో ప్రముఖ బాల సాహితీవేత్త కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. 20 ఏళ్లకు పైగా బాల సాహిత్య రంగంలో సేవలంది స్తున్నారు. పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందిస్తూ నిరంతరం కథలు, గేయాలు, పాటలు, కవితలు రాస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. పిల్లల మనస్తత్వానికి అనుగుణంగా సులభమైన భాషలో రచనలు చేయడం ఆయన ప్రత్యేకత. గత ఏడాది కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి రాసిన 'ఊగుతున్న ఉయ్యాల' బాలల గేయ సంపుటిని పాఠకులను విశేషంగా ఆకట్టుకుంది.

**కంప్యూటర్ పిల్లలం బాలగేయం..**
మరాఠీ ఆదిపత్యం కలిగిన మహారాష్ట్రలో పాఠ్యపుస్తకాల తయారీ ప్రక్రియ చాలా కఠినంగా ఉంటుంది. విషయం, భాషా సరళత, బాలల మనస్తత్వం వంటి అనేక కోణాలను పరిశీలించిన తర్వాతే పాఠ్యాంశాలను ఎంపిక చేస్తారు. రెండేళ్ల క్రితం మహారాష్ట్ర పాఠ్యాంశాల ఎంపిక కమిటీ.. కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి రాసిన బాల సాహిత్యం, పుస్తకాలను పరిశీలించింది. ముఖ్యంగా బుచ్చిరెడ్డి రాసిన 'ఊగుతున్న ఉయ్యాల' బాల గేయ సంపుటిని పరిశీలించింది. మహారాష్ట్ర ప్రభుత్వం, తెలుగు భాషను అభ్యసిస్తున్న అక్కడి నాలుగో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన 'బాలభారతి' పాఠ్య పుస్తకంలోనీ కంప్యూటర్ పిల్లలం' గేయాన్ని ఒక పాఠ్యాంశంగా చేర్చింది.

**సాహితీ సరిహద్దుల చెరిపివేత..**
సాంకేతిక యుగంలో పెరుగుతున్న చిన్నారులకు సులభమైన పదాలతో, లయబద్ధంగా కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పరిచయం చేసే "కంప్యూటర్ పిల్లలం"గేయం.. పిల్లల్ని అలరిస్తూనే ఆలోచింపజేస్తుంది. క్లిష్టమైన భాషా పరిజ్ఞానం లేకుండా, పిల్లలు సులభంగా పాడుకోగలిగే లయబద్ధమైన శైలి ఇందులో ఉంది. ఆధునిక సాంకేతికతను (కంప్యూటర్) పాఠ్యాంశంలోకి తీసుకురావడం ద్వారా, విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచేలా ఉండటం. నేటి డిజిటల్ యుగంలో పిల్లల ఆలోచనా విధానాన్ని ప్రతిబింబించేలా ఉండటంతో ఈ గేయాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన నాలుగో తరగతి తెలుగు 'బాల భారతి' పాఠ్య పుస్తకంలో పాఠ్యాంశంగా చేర్చింది. బుచ్చిరెడ్డి రచించిన "ఊగుతున్న ఉయ్యాల" బాల గేయాల సంపుటి ఇప్పటికే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల ప్రశంసలు అందుకుంది. సరళమైన భాష, పిల్లలకు అర్థమయ్యే పదాలు, విలువలతో కూడిన భావాలు ఈ పుస్తకానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. తెలుగు బాలసాహిత్యానికి మరో కొత్త మైలురాయిగా నిలిచిపోయింది.తరగతి గదిలో పిల్లలకు అక్షరాలు నేర్పే గురువు... ఇప్పుడు మరో రాష్ట్రంలోని పిల్లల మనసుల్లో తన పదాలను నాటబోతున్నారు. తెలుగు భాషకు, బాలసాహిత్యానికి, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల సృజనాత్మకతకు దక్కిన గౌరవమని బాల సాహితీవేత్త కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి చెబుతున్నారు. నల్లగొండ జిల్లా నుంచి వెలిసిన ఓ గేయం... ఇప్పుడు మహారాష్ట్రలోని వేలాది మంది చిన్నారుల గొంతుల్లో మార్మోగబోతోంది.

# స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు




### ⏭ అందజేసిన ఉపముఖ్య మంత్రి భట్టి, మంత్రి వివేక్

**టి మీడియా, జూలై 17 , కొమురం భీం:**
మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్ఎస్ఆర్బీ) ద్వారా ఎంపికైన 247 మంది స్టాఫ్ నర్సులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి మంత్రి డా. వివేక్ వెంకటస్వామి నియామక పత్రాలు అందజేశారు. శుక్రవారం కొమురం భీం ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి వివేక్ మాట్లాడుతూ.. కార్మికులు, వారి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని, అందుకే సిబ్బంది కొరతను పూర్తిగా తొలగించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రస్తుతం ఈఎస్ఐ సేవలు రాష్ట్రంలోని సుమారు 20 లక్షల మంది బీమా పొందిన కార్మికులకు, వారి కుటుంబ సభ్యులతో కలిపి దాదాపు 75 లక్షల మంది లబ్ధిదారులకు అందుతున్నాయని మంత్రి తెలిపారు. ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలంటే వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, మందులు, ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉండాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని ఈఎస్ఐ ఆస్పత్రులను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఇటీవల కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయతో కూడా ఈ అంశాలపై చర్చించినట్లు తెలిపారు. సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిపై ఉన్న భారాన్ని తగ్గించేందుకు రామచం

# బిల్లుల ఆమోదమే ప్రభుత్వ ప్రాధాన్యం

### ⏭ పార్లమెంట్ సమావేశాలపై వ్యూహరచన

**టి మీడియా, జూలై 17 , ఢిల్లీ బ్యూరో :**
పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న వేళ ఎన్?డీఏ ప్రభుత్వం వ్యూహరచనను వేగవంతం చేసింది. ఈ క్రమంలో దిల్లీలోని కర్తవ్య భవన్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన మంత్రుల బృందం కీలక సమావేశం నిర్వహించింది. జులై 20న జరగనున్న పార్లమెంట్ వార్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం చేపట్టాల్సిన విధివిధానాలు, రెండు ఆర్డినెన్స్‌లను చట్టాలుగా మార్చడంపై ఎన్?డీఏ కూటమి చర్చించింది. ముఖ్యంగా ఆదాయపు పన్నుసవరణ బిల్లు, గతంలో నెగ్గని డీలిమిటేషన్‌తో కూడిన మహిళా రిజర్వేషన్ బిల్లులను మళ్లీ పార్లమెంట్ ముందుకు తెచ్చేందుకు ఎన్?డీఏ కసరత్తు చేస్తోంది. మరోవైపు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా నీట్ పేపర్ లీకేజీ, పశ్చిమాసియా ఘర్షణల్లో భారతీయ నావికుల మృతి, అయోధ్య రామాలయ విరాళాల్లో అవకతవకల ఆరోపణలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి.



**పార్లమెంటరీ పార్టీ సమావేశానికి 'మంగళ్ మిలన్' పేరు**
జులై 21న జరగనున్న పార్లమెంటరీ పార్టీ సమావేశానికి 'మంగళ్ మిలన్' అని ఎన్‌డీఏ పేరు పెట్టింది. పార్లమెంట్ లైబ్రరీ భవనంలోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో ఉదయం 9:30 గంటలకు జరగనున్న ఈ సమావేశానికి లోక్‌సభ, రాజ్యసభలకు చెందిన ఎన్?డీఏ ఎంపీలందరూ హాజరుకానున్నారు. ప్రభుత్వ శాసనపరమైన అజెండా నేపథ్యంలో ఎన్?డీఏ నాయకుల ఈ సమావేశం ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు గతంలో ప్రకటించినట్లుగా, ఆగస్టు 13 వరకు కొనసాగే వర్షాకాల సమావేశాల్లో పలు ముఖ్యమైన బిల్లులను చేపట్టే అవకాశం ఉంది.
ఇదిలా ఉండగా, డీలిమిటేషన్ బిల్లుపై డీఎంకే ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల పునర్విభజనపై కేంద్రం బిల్లు పెడితే అధ్యయనం చేసి, తమిళనాడు ప్రయోజనాల మేరకు నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. బిల్లు పరిధి, లక్ష్యాలు తెలిసిన తర్వాత విశ్లేషించి నిర్ణయం తీసుకుంటామని డీఎంకే వర్గాలు తెలిపాయి. తమిళనాడు ప్రయోజనాలు కాపాడేందుకు డీఎంకే తీసుకునే నిర్ణయం స్వతంత్రంగా ఉంటుందని ఆ పార్టీ వర్గాలు వివరించాయి. డీలిమిటేషన్‌పై వర్షాకాల సమావేశాల్లో పెట్టే బిల్లు స్వతంత్ర చట్టంగానే ఉండే అవకాశం ఉందని, ఇతర చట్టాలతో కలిపి ఉండదని భావిస్తున్నట్లు తెలిపాయి. 50 శాతం సీట్ల పెంపు, రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న సీట్ల పంపిణీ నిష్పత్తిని అలాగే కొనసాగించడం తదితర వంటి అంశాలు చర్చలో ఉన్నాయని పేర్కొన్నాయి. జులై 16న జరిగిన పార్టీ ఎంపీల సమావేశంలో డీలిమిటేషన్‌పై చర్చ జరిగింది. లండన్‌లో ఉన్న డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్నారు. హస్తం పార్టీతో పొత్తులేనందున బిల్లు విషయంలో కాంగ్రెస్ పార్టీని సంప్రదించకుండా స్వతంత్రంగానే నిర్ణయం తీసుకుంటామని డీఎంకే వర్గాలు వివరించాయి.

**డీఎంకే, ఇండి కూటమిపై జైరాం రమేశ్ కీలక వ్యాఖ్యలు**
మరోవైపు, డీఎంకే, ఇండి కూటమికి సంబంధించిన అంశంపై కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్? మాట్లాడారు. "బీజేపీ, డీఎంకేల సిద్ధాంతాలు వేర్వేరు కాబట్టి అవి ఎప్పటికీ కలిసి పనిచేయలేవు. 8వ తేదీన జరిగిన ఇండి కూటమి సమావేశానికి డీఎంకే హాజరుకాలేదన్నది, అలాగే మేము టీవీకేకి మద్దతు ఇస్తున్నామన్నది వాస్తవమే. ప్రభుత్వంలో మాకు ఇద్దరు కేబినెట్ మంత్రులు కూడా ఉన్నారు. మేం డీఎంకే ఎంపీలతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నాం, చర్చలు కొనసాగుతున్నాయి. డీఎంకే ఇప్పటికీ ప్రతిపక్ష పార్టీయే తప్ప, అధికార పక్షం లేదా ఎన్?డీఏలో భాగం కాదు. స్టాలిన్ చేసిన ప్రకటనలను నేను చదివాను, బీజేపీ, డీఎంకేల మధ్య ఎలాంటి ఒప్పందం లేదని స్పష్టమవుతోంది. సరైన సమయం వచ్చినప్పుడు డీఎంకే కచ్చితంగా నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా నిలబడుతుందని నాకు నమ్మకం ఉంది" అని జైరాం రమేశ్? వ్యాఖ్యానించారు.

# బీమా డబ్బుల కోసం గర్భాశయ తొలగింపు

### ⏭ ప్రైవేట్ ఆసుపత్రుల దాష్టీకం!

**టి మీడియా, జూలై 17 , ఢిల్లీ బ్యూరో :**
మహిళల్లో గర్భాశయాన్ని తొలగించే హిస్టరెక్టమీ శస్త్రచికిత్సలు ఎందుకు పెరుగుతున్నాయి? గ్రామీణ, పట్టణ మహిళల ఆరోగ్య పరిస్థితుల్లో ఉన్న తేడాలేంటి? మెనోపాజ్ సమయంలో వారు ఎలాంటి శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతుకుతూ సాగర్ విశ్వవిద్యాలయం నిర్వహించిన అధ్యయనం పలు కీలక విషయాలను వెలుగులోకి తీసుకొచ్చింది. ప్రైవేటు ఆసుపత్రులు బీమా డబ్బుల కోసం గర్భాశయ తొలగింపు శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు గుర్తించింది. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో అధిక సంఖ్యలో హిస్టరెక్టమీలు జరగడం, వాటిలో చాలా వరకు ఆరోగ్య బీమా, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలతో ముడిపడి ఉండొచ్చనే అంశాన్ని ఈ పరిశోధన ప్రస్తావించింది. డాక్టర్ హరిసింగ్ గౌర్ సెంట్రల్ యూనివర్శిటీ (సాగర్ విశ్వవిద్యాలయం) ఆంత్రోపాలజీ విభాగానికి చెందిన పరిశోధకురాలు సుమన్ సాహు, ప్రొఫెసర్ రాజేశ్? కె. గౌతమ్ మార్గదర్శకత్వంలో ఈ అధ్యయనం నిర్వహించారు. "బయో-సోషల్ డిటర్మినెంట్స్ ఆఫ్ మెనోపాజ్ అండ్ హిస్టరెక్టమీ: ఎ కంపారిటివ్ స్టడీ అమాంగ్ రూరల్ అండ్ అర్బన్ ఉమెన్ ఆఫ్ బిలాస్‌పూర్ డిస్ట్రిక్ట్" అనే అంశంపై ఈ పరిశోధన జరిగింది.

**800 మంది మహిళలపై అధ్యయనం**
2013-14, 2017లో వెలువడిన మీడియా కథనాల నేపథ్యంలో బిలాస్‌పూర్ జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు చెందిన 800 మంది మహిళలను మూడు వర్గాలుగా విభజించి అధ్యయనం నిర్వహించారు. ఇందులో మెనోపాజ్ దశలో ఉన్నవారు, మెనోపాజ్‌కు ముందు దశలో ఉన్నవారు, ఇప్పటికే హిస్టరెక్టమీ చేయించుకున్న మహిళలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులు, సామాజిక పరిస్థితులను విశ్లేషించారు.

**47 ఏళ్లకే మెనోపాజ్**
పరిశోధన ప్రకారం మహిళల్లో మెనోపాజ్ సగటు వయస్సు 47 సంవత్సరాలుగా నమోదైంది. అలాగే గ్రామీణ మహిళలతో పోలిస్తే పట్టణ మహిళల్లో బరువు ఎక్కువగా ఉండగా, ఆరోగ్య సేవలు, వైద్య సమాచారం కూడా వారికి సులభంగా అందుతున్నట్లు గుర్తించారు. గ్రామీణ మహిళలు మాత్రం పోషకాహార లోపం, ఆరోగ్య సదుపాయాల కొరతతో ఇబ్బందులు పడుతున్నట్లు అధ్యయనం వెల్లడించింది. హిస్టరెక్టమీ చేయించుకున్న మహిళల్లో 87 శాతం మందికి అధిక రుతుస్రావమే ప్రధాన కారణంగా గుర్తించారు. అలాగే 47 శాతం కేసుల్లో తరచూ రుతుస్రావం కావడం రెండో ప్రధాన కారణంగా తేలింది. మిగిలిన కేసుల్లో ఇన్ఫెక్షన్లు, గాయాలు, గర్భాశయ సిస్టులు, క్యాన్సర్ వంటి సమస్యలు కారణమైనట్లు పరిశోధన వెల్లడించింది.

**పట్టణాల్లోనే ఎక్కువ హిస్టరెక్టమీలు**
గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో హిస్టరెక్టమీ శస్త్రచికిత్సలు ఎక్కువగా జరుగుతున్నట్లు అధ్యయనంలో తేలింది. ఆరోగ్య బీమా, ప్రభుత్వ పథకాల ద్వారా ఖర్చు భర్తీ అవుతుండటంతో కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు శస్త్రచికిత్సలపై అధికంగా దృష్టి సారిస్తున్నాయనే అంశాన్ని కూడా పరిశోధన ప్రస్తావించింది. హిస్టరెక్టమీల్లో అధికశాతం ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే జరిగినట్లు గుర్తించారు. మెనోపాజ్, రుతుస్రావం, గర్భాశయ సమస్యలపై గ్రామీణ మహిళలు బహిరంగంగా మాట్లాడేందుకు ఇప్పటికీ సంకోచిస్తున్నారని పరిశోధనలో తేలింది.